

7న ఎఐఐసిఇయు వర్కింగ్ కమిటీ సమావేశం

రాజమహేంద్రవరం : అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం వర్కింగ్ కమిటీ సమావేశం చెన్నైలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరుగుతుందని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ తెలిపారు, ఈ మేరకు గోడ పత్రికను భోజన విరామ సమయంలో ఎల్ఐసి కార్యాలయం వద్ద శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సమావేశాలకు దేశవ్యాప్తంగా యూనియన్ నాయకులు పాల్గొంటారన్నారు. సమస్యలపై కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తారన్నారు. బీమా రంగంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, రాబోతున్న మార్పులు, ఎదుర్కొంటున్న సవాళ్లు తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. ఈ సమావేశాలకు రాజమండ్రి డివిజన్ తరపున కోదండరామ్ హాజరు అవుతారన్నారు. ృక్రమంలో యూనియన్ అధ్యక్షులు ఎస్ఆర్జె.మాథ్యూస్, ఉపాధ్యక్షులు సిహెచ్.సత్యదేవ, మహిళా కన్వీనర్ అర్.శిరీష, ఉమాదేవి, సంయుక్త కార్యదర్శి పిఎస్ఎన్.రాజు, పాల్గొన్నారు.

'ధర' దడ



ధరల పెరుగుదల ఇలా...
(కిలోకు రూ.లలో, నూనె లీటర్లలో)

నిత్యావసరం	జూన్	నవంబర్
కర్నూలు సోనా	55	62
కంది పప్పు	160	210
శనగపప్పు	90	125
పెసర పప్పు	100	130
మినప పప్పు	100	160
వేరుశనగ	95	135
ఉల్లి	60	80
సన్‌ఫ్లవర్ ఆయిల్	110	155
పామాయిల్	98	135
వేరుశనగ నూనె	120	165
పంచదార	35	45
వెల్లుల్లి	190	400

రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు చిన్న, మధ్య తరగతి ప్రజలకు దడ పుట్టిస్తున్నాయి. సంపాదన మూరేడు.. ఖర్చులు బారెడు చందంగా పరిస్థితులు మారాయని సామాన్యులు గగ్గోలు పెడుతున్నారు. కుటుంబమంతా పని చేసినా పెరుగుతున్న నిత్యావసర ధరలతో రెండుపూటలా తినలేని పరిస్థితి నెలకొంది. మధ్య తరగతి ప్రజల నెలసరి ఆదాయానికి ఖర్చు కు పొంతన కుదరడం లేదు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది.

- ఆరు నెలలుగా పైపైకి
- పప్పులు, నూనెలతో పాటు కూరగాయలూ అదే బాట
- ధరల నియంత్రణలో సర్కారు విఫలం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గడిచిన 6 నెలలుగా పెరిగిన ధరలు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. పప్పులు, నూనెలు, కూరగాయలూ ఇలా ఒక్కటేంటి అన్ని ధరలూ భగ్గుమంటున్నాయి. గత ప్రభుత్వం ధరల నియంత్రణలో విఫలమైన విషయం విధితమే. తాము అధికారంలోకొస్తే ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్న కూటమి నేతలు ఎన్నికల ముందు హామీలు గుప్పించారు. అయితే ఆచరణలో భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. గత ప్రభుత్వం కన్నా ధరలు మరింత పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తుంది. ప్రస్తుతం సామాన్యుల నిత్యావసరాల కోసం నెలవారీ బడ్జెట్ రూ.20వేల నుంచి రూ.30వేలు చేరిందనివాపోతున్నారు. కిలో సన్‌ఫ్లవర్ నూనె 6 నెలల క్రితం రూ.105 కాగా ప్రస్తుతం దాని ధర రూ. 150కి చేరింది. పామాయిల్ ధర రూ. 98 నుంచి దశల వారీగా ప్రస్తుతం రూ. 135కి చేరింది. వేరుశెనగ నూనె ధర రూ..155 నుంచి రూ. 190 వరకు చేరింది. నిత్యావసరమైన నూనెల ధరలు ప్రజలకు అందనంత దూరానికి ఎగబాకుతున్నాయి. కనీసం పప్పు నీళ్లతో అయినా కాలం గడుపుదామనుకున్నా అదీ అందుబాటులో లేని పరిస్థితి. కందిపప్పు కేజీ రూ.165 నుంచి దశల వారీగా రూ.210కి చేరింది. మినుములు రూ.100 నుంచి రూ.160, పెసరపప్పు రూ.100 నుంచి రూ. 130, చక్కెర రూ. 35 నుంచి రూ.45 వరకు, గోధుమలు రూ.50 నుంచి రూ.65 వరకు పెరిగాయి. కూరగాయల ధరలూ అదే బాటలో ఉన్నాయి. గతంలో కార్తీక మాసంలోనూ లేదా ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటనష్టం జరిగినప్పుడు,. డిమాండ్‌కు సరిపడా సరకు లేనప్పుడు మాత్రమే సరుకుల ధరలు పెరిగేవి. నేడు ఈ పరిస్థితులకు భిన్నంగా గడిచిన కొన్ని నెలలుగా కూరగాయల ధరలు నింగిని తాకుతున్నాయి. ప్రస్తుతం టమోటా బహిరంగ మార్కెట్లో రూ.60 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. బెండ, బీర, చిక్కుడు ఇతరాత్ర రకాలు ఏదేని కేజీ రూ.50 తక్కువ లేదు.

రైతు బజార్లలో స్వల్పంగా ధరల వ్యత్యాసం ఉన్నప్పటికీ నాణ్యతా లోపంతో కొనుగోలు దారులకు నిరాశే ఎదురవ్వుతోంది. అదే విధంగా రైతు బజార్లలో సబ్సిడీపై కొన్ని రకాల నిత్యావసరాలు విక్రయిస్తున్న విషయం విధితమే. అయితే రేషన్ కార్డు ఉన్న వారికి మాత్రమే సబ్సిడీ ధరలకు నిత్యావసరాలు లభిస్తున్నాయి. బియ్యం, సన్ ఫ్లవర్ ఆయిల్, పామాయిల్, కందిపప్పు సరుకుల ధరలు వ్యత్యాసం స్వల్పంగానే ఉండటంతో కొనుగోలు దారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ధరలను నియంత్రించాలి

ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రతి జిల్లాలోనూ ధరల నియంత్రణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పినా ఆచరణలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. మరో వైపు దొడ్డిదారిన పన్నులు, ఛార్జీల రూపంలో వసూలు జరుగుతోంది. ప్రతి కుటుంబంలో భార్యభర్తలు ఇద్దరూ కష్టపడినా కుటుంబ ఖర్చులకోసం ఇబ్బందులు తప్పటం లేదు. ధరల నియంత్రణపై దృష్టి పెట్టాలి.

- కె. రమ, సీతంపేట రాజమహేంద్రవరం

బియ్యం ధరలూ పైపైకి..

బియ్యం ధరలు సైతం రోజురోజుకూ ఎగబాకుతున్నాయి. కిలో సన్నబియ్యం కేజీ రూ.50 నుంచి ప్రస్తుతం రూ.62లకు చేరింది. కొన్ని సాధారణ రకాల బియ్యం కూడా కేజీ రూ.50 పైనే ఉన్నాయి. దీంతో నెలకు 26 కేజీలు వినియోగించే ఒక కుటుంబపై రూ.300 వరకూ అదనపు భారం పడుతోంది. పేదలు రేషన్ బియ్యం ఉన్నంత వరకూ వాడుకుంటున్నారు. అనంతరం మరో పది నుంచి 15 కేజీలు బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

చలో విజయవాడ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - తాళ్లపూడి, రాజమహేంద్రవరం

సిపిఎస్‌ను రద్దు చేయాలంటూ డిసెంబర్ 10న తలపెట్టిన 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరంలోని ఎన్‌జిఒ కార్యాలయంలో శుక్రవారం దీనికి సంబంధించిన గోడపత్రికను నాయకులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలకు సంవత్సరంలోపు పరిష్కారం చూపుతామన్న ప్రభుత్వ పెద్దలు దానికి తగిన విధంగా రోడ్ మ్యాప్ ప్రకటించాలన్నారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని, ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి జెఎసి ఛైర్మన్ వైవిఎస్.నాయుడు, ఎపి ఎన్‌జిఒ నగర కార్యదర్శి ఎస్.ప్రవీణ్ కుమార్, ఎపి సిపిఎస్ఇఎ జిల్లా అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ సోమశేఖర్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయకర్, ప్రధాన కార్యదర్శి షరీఫ్, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దున్నా దుర్గారావు, శంకరం, ఎస్‌టియు నాయకులు త్రినాథ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

స్వాగతం పలుకుతున్న ఎంఎల్ బత్తుల

డిప్యూటీ సిఎంకు స్వాగతం పలికిన ఎంఎల్ఎ బత్తుల

ప్రజాశక్తి - కోరుకొండ

కాకినాడ జిల్లాలో పర్యటన నేపథ్యంలో మధురపూడి విమానాశ్రయానికి వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ ఘనంగా స్వాగతం పలికారు. శాలువా కప్పి, పూల బొకే అందించి స్వాగతం పలికారు. ఇండిగో విమానంలో మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్న ఆయన రోడ్డు మార్గంలో కాకినాడకు పయనమయ్యారు. ఆయన వెంట పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఉన్నారు. పవన్ రాక సందర్భంగా విమానాశ్రయ ప్రాంగణం పవన్ అభిమానులతో సందడిగా మారింది.

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

36 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని చిపటం పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 36 మందికి ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. స్కోజో ఫౌండేషన్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ఈ నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించామని సంస్థ ప్రతినిధి జి.అజోర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు చేయించుకున్న వారిలో ఐదుగురికి శాస్త్ర చికిత్సలు చేయాల్సి ఉందన్నారు. 16 మందికి కళ్లజోళ్లు అవసరం అవుతాయన్నారు. వారికి మార్కెట్ కంటే తక్కువ ధరకే కళ్లజోళ్లను అందిస్తామన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు రిఫర్ చేశామన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికీ శస్త్ర చికిత్సలు ఉచితంగానే చేస్తారన్నారు.

జిజియులో ఐడిఇ బూట్ క్యాంప్ ప్రారంభం

ప్రజాశక్తి - రాజానగరం

గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో ఎఐసిటిఇ సౌజన్యంతో రెండు రోజుల ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఇంటర్న్‌షిప్(ఐడిఇ) బూట్ క్యాంప్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం కులపతి కెవివి.సత్యనారాయణరాజు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా తిరుపతి ఐఐటి టెక్నాలజీ ఇంక్రిబేషన్ హబ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ రోషన్ శ్రీవాత్సవ్ హాజరై మాట్లాడారు. తిరుపతి ఐఐటి గ్రామీణ విద్యార్థులకు కొత్త ఆవిష్కరణలకు అవసరమైన నైపుణ్యాభివృద్ధికి తోడ్పాటు ఇస్తుందన్నారు. జిజియు అనుసంధానంతో విద్య జిఐఎస్ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు చేయూతనిస్తామన్నారు. జిజియు ఛాన్సలర్ చైతన్య రాజు మాట్లాడుతూ అపారమైన ప్రజ్ఞాపాతవాలు అధ్యాపకుల సొంతమన్నారు. కష్టించి పనిచేస్తే ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదగొచ్చన్నారు. రెండు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరో ముఖ్యఅతిథి ఐపి అండ్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ సెల్(ఎఐసిటిఇ) మేనేజర్ డాక్టర్ ఐఎన్.భీమలింగారెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు రెండు దశల్లో శిక్షణ నిర్వహించామని, ప్రస్తుతం మూడో దశ శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు వాద్వానీ ఫౌండేషన్ నుంచి హాజరైన విశాల్ నాయర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వాద్వానీ ఫౌండేషన్ సౌజన్యంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. జిజియు విసి డాక్టర్ యు.చంద్రశేఖర్ మాట్లాడుతూ సమాజంలో రైతులలో 88 శాతం మంది సన్న, చిన్నకారు రైతులే ఉన్నారన్నారు. సాంకేతికతను ఉపయోగించి రైతులకు ఎంతో మేలు చేయొచ్చన్నారు. బూట్ క్యాంప్ నోడల్ అధికారి డాక్టర్ టి.జయానందకుమార్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలతో పాటు, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల నుంచి నమోదు చేసుకున్న 271 మంది ఈ శిక్షణకు హాజరయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డాక్టర్ పిఎంఎస్.శర్మ, కార్యక్రమ మోడల్ అధికారులు దండమూడి విజేంద్రకుమార్, వినోద్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైతన్యరాజు, రోషన్ శ్రీవాత్సవ్ తదితరులు

ఇవిఎంల గొడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఎఫ్‌సిఐ గొడౌన్‌లో ఉన్న ఇవిఎంల గొడౌన్‌ను రాజమహేంద్రవరం ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్‌తో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడారు. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గ దర్శకాల మేరకు ఇవిఎంలు భద్రపరచిన గోడౌన్ సందర్శించి తనిఖీలు చేపట్టామన్నారు. ఇవిఎంలను నిరంతర సిసి కెమెరాల పర్యవేక్షణలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రంగా ఉంచామన్నారు. సిసి కెమెరాల పనితీరును రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించామన్నారు. ఆమె వెంట అర్బన్ తహశీల్దార్ పిహెచ్‌జిఆర్.పాపారావు, రెవెన్యూ, భద్రతా సిబ్బంది ఉన్నారు.

స్టాల్ వద్ద మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్ఒ వెంకటేశ్వరరావు

ఎయిడ్స్ నియంత్రణపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణపై ప్రజలు అవగాహన కల్పించడం కోసం విస్తృత ప్రచార కార్యక్రమాలను చేపట్టామని డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం గోకవరం బస్టాండ్ వద్ద ఐఇసి మెటీరియల్‌తో కూడిన అవగాహన స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డిసెంబర్ 1న నిర్వహించనున్న ప్రపంచ ప్రపంచ ఎయిడ్స్ డే లో భాగంగా ఎయిడ్స్ నియంత్రణ పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ స్టాల్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా నారీ సాక్ష్యం, వైఆర్‌జి కేర్ స్వచ్ఛంద సంస్థలు సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.హారిక, డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస, నారి సాక్ష్యం, వైఆర్‌జి కేర్ ప్రతినిధులు సోమరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలే ఆశాల విధి

ప్రజాశక్తి - నల్లజర్ల

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను నిరంతరాయంగా విజయవంతం చేయడమే ఆశా కార్యకర్తల ప్రధాన విధి అని జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్(డిపిహెచ్ఎన్ఒ) జి.వసంతలక్ష్మి అన్నారు. రాజమహేంద్రవరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో డిపిహెచ్ఎన్ఒతో ఆంధ్రప్రదేశ్ వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జివివి.ప్రసాద్ ఆశాల విధి నిర్వాహణలో గ్రామాల్లో ఎదురవుతున్న ఇబ్బందులు గురించి చర్చించారు. ప్రస్తుతం, పలు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించి సర్వేలు, కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయన్నారు. వైద్య ఆరోగ్య ఉద్యోగులను ఇతర శాఖల పనులకు ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరనాదని ఇటీవల జరిగిన వైద్యాధికారుల జూమ్ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంతి స్పష్టం చేశారని గుర్తు చేశారు. అదే శాఖలో గ్రామ స్థాయిలో కీలకంగా పనిచేసే ఆశాలను కొందరు అధికారులు బెదిరింపు ధోరణితో హుకుం జారీ చేస్తున్నారన్నారు. దీనిపై వసంతలక్ష్మి స్పందించి మాట్లాడారు. ఆశాలకు అనునిత్య ఆరోగ్య కార్యక్రమాలతో ప్రస్తుతం, పలు జాతీయ ఆరోగ్య కార్యక్రమాల సర్వేలు జరుగుతున్నాయన్నారు. ఎంతో ప్రాధాన్యతతో కూడిన ఎన్‌సిడి 3.0 కార్యక్రమంలో ఆశాలు బిజీగా ఉన్నారన్నారు. ఇతర కార్యక్రమాలు చేయాలంటూ ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ఉత్తర్వులు లేవన్నారు. ఆశాలు ప్రస్తుత సర్వే కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు.

డిపిహెచ్ఎన్ఓతో చర్చిస్తున్న నాయకులు

నేడు పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - చాగల్లు

డిసెంబర్ నెలకు సంబంధించిన పింఛన్లను శనివారమే పంపిణీ చేయనున్నట్టు ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి తెలిపారు. మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలో 9,319 లబ్ధిదారులు ఉన్నారన్నారు. వీరికి రూ.3.96 కోట్లను పింఛనుగా అందించనున్నామన్నారు. శనివారం ఉదయం 5:30 గంటల నుంచే పింఛను పంపిణీ చేస్తామన్నారు.

కార్టూ'నిజం'



దగాకోరు విధానాలను ప్రతిఘటించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పాలకుల దగాకోరు విధానాలను ప్రతిఘటించాలని, అదే అమరులకు ఇచ్చే నిజమైన నివాళి అని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నార. నగరంలోని అంబేద్కర్ భవన్‌లో పిడిఎస్‌యు (విజృంభణ) జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ అధ్యక్షతన అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బ్రిటిష్ వలస పాలన నుంచి దేశాన్ని, ప్రజలను విముక్తి చేయడానికి ఝాన్సీ లక్ష్మీబాయి, భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, కొమరం భీమ్, ద్వారబంధాల చంద్రయ్య తదితరులు పోరాడి ప్రాణాలర్పించారన్నారు. బ్రిటిష్ పాలన నుంచి అధికారాన్ని బదలాయించుకున్న గాంధీ, నెహ్రూ, పటేల్ లాంటి వారు ప్రజల సమస్యలు పరిష్కరించలేదన్నారు. విదేశీ దోపిడీ రద్దు కాలేదని దున్నేవాడికే భూమి పంచలేదన్నారు. ప్రజలందరికీ కూడు, గూడు, విద్య, ఆరోగ్యం లభించడం లేదన్నారు. మోదీ ప్రభుత్వం ప్రజల అసంతృప్తిని పక్కదోవ పట్టించడానికి మతఘర్షణలు సృష్టిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పెత్తనానికి వ్యతిరేకంగా ఉద్భవించిన టిడిపి కేంద్రంలోని బిజెపితో జతకలిసి ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశారన్నారు. మోది విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న పోరాడుతున్న వారిపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. ప్రజల అసంతృప్తిని పక్కదోవ పట్టించడానికి తిరుపతి లడ్డూ, దళిత హోం మంత్రిపై పవన్ విమర్శలు వంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. వీటిని ప్రజలందరూ గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొండ దుర్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, మడికి సత్యం, డి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వీరాంజనేయులు

కార్యకర్తలే పార్టీకి మూల స్తంభాలు

ప్రజాశక్తి - కడియం

పార్టీకి కార్యకర్తలే మూల స్తంభాలని, కార్యకర్తలకు ఏదైనా ప్రమాదం జరిగినా, మరణించినా వారి కుటుంబాలకు ఆదుకొనేందుకు సభ్యత్వ నమోదు ఎంతో భరోసాగా ఉంటుందని రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మండలంలోని వేమగిరిలో శుక్రవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో గతంలో సభ్యత్వ నమోదు చేయించుకున్న పలువురు కార్యకర్తలకు ప్రమాద బీమా అందించామన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు వాట్సాప్, టిడిపి యాప్, టెలిగ్రామ్ ద్వారా పొందొచ్చన్నారు. రూ.100 చెల్లిస్తే సభ్యత్వంతో పాటు రూ.5 లక్షల ప్రమాద బీమా, సహజ మరణానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, పార్టీ నాయకులు వెలుగుబంటి రఘురాం, వాసిరెడ్డి రాంబాబు, చెల్లుబోయిన శ్రీనివాస్, వెలుగుబంటి వెంకటాచలం, పితాని శివరామకృష్ణ, గుత్తుల కృష్ణ, వాసంశెట్టి నాగబాబు, సురపరెడ్డి జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ గోరంట్ల

మెగా పేరెంట్స్ మీట్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - గోపాలపురం

తల్లిదండ్రులు ఉపాధ్యాయుల మెగా సమావేశాన్ని రాజకీయాలకు అతీతంగా విజయవంతం చేయాలని ఎంఇఒలు జి.శ్రీనివాసరావు, ఎ.మహేశ్వరరావు హెచ్ఎంలకు సూచించారు. శుక్రవారం గోపాలపురం జడ్‌పి ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంతో సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 7న మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల వికాసానికి, సమస్యల పరిష్కారానికి ఈ సమావేశం వేదికగా నిలుస్తుందన్నారు. విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులు తెలుసుకోవచ్చన్నారు. ఈ సమావేశాల్లో ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించాలన్నారు.

తాళ్లపూడి : డిసెంబర్ 8న నిర్వహించే మెగా పేరెంట్స్ సమావేశం విధి విధానాలపై శుక్రవారం హెచ్ఎంలతో వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. వేగేశ్వరపురం కెఎస్ఆర్‌సిహెచ్ ఉన్నత పాఠశాలలో ఈ కాన్ఫరెన్స్ అనంతరం ఎంఎఇఒలు బాలామణి, నెహ్రూజీ మాట్లాడారు. మెగా పేరెంట్స్ మీట్‌ను జయప్రదం చేయాలన్నారు.

ట్రెజరీ అధికారికి అభినందన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎపి స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్లు శుక్రవారం ట్రెజరీ అధికారిని కలిశారు. పుష్ప గుచ్ఛం అందించిన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెన్షనర్లకు కమ్యూటేషన్ 135 నెలలు దాటిన వారికి, రికవరీ లేకుండా పెన్షన్ లో కలిపి చెల్లించే నగదుకు గతంలో 180 నెలలు వరకు తగ్గించే వారన్నారు. తాము దీనిపై కోర్టుకు వెళ్లామన్నారు. 135 నెలలకు తగ్గిస్తూ ఆదేశాలు ఇచ్చిందన్నారు. అలాగే డిఎ, ఐఆర్, ఎరియర్స్ చెలింపునకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పళ్ల సత్యనారాయణమూర్తి, అద్దంకి సుబ్బారావుచ, ఎ.భీమేశ్వరరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి- మామిడికుదురు

మామిడికుదురులో ఒక మహిళ మెడలో శుక్రవారం పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. వివరాలు ఇవి.. అడబాల శేషకుమారి మెడలో ఆరుకాసుల బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి ఇంటికి వచ్చి పట్టపగలే ఆమె మెడలో గొలుసు చోరీ చేశాడు ఆమె కేకలు వేయడంతో కిందికి తోసేసి గోడ దూకి పారిపోయాడు . పెనుగులాట సందర్భంలో చోరీకి పాల్పడిన దొంగకి సంబంధించిన సెల్ ఫోను కిందపడిపోయింది. నగరం ఎస్ఐ చైతన్య కుమార్ సంఘటనా స్థలాన్ని చేరుకుని విచారణ చేపట్టారు. ముగ్గురు చోరీకి పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని లంకల పరివాహక ప్రాంతాలలో శుక్రవారం కొత్తపేట ఎక్సైజ్ కార్యాలయం సిబ్బంది నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడులలో సారా విక్రయించేందుకు తీసుకెళుతున్న వెలిచేరు గ్రామానికి చెందిన నిచ్చెన కోళ్ళ నాగరాజును అదుపులో తీసుకున్నారు. అతని వద్ద నుండి 10 లీటర సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు కొత్తపేట ఎక్సైజ్ ఎస్ఐ కాత్యాయని తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ కె.అన్నవరం, ఇబ్బంది పాల్గొన్నారు.

ఆలమూరు : స్థానిక ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడుల్లో మద్యం, నాటు సారా అమ్మకాలు నిర్వహిస్తున్న ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. ఎక్సైజ్ సిఐ ఐ.డి.నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక సర్కిల్ పరిధిలోని మండపేట మండలంలోని ద్వారపూడికి చెందిన మట్ట వెంకటలక్ష్మి, కేశవరంకు చెందిన గుండిమేని త్రివేణి నాటు సారా అమ్మకాలు చేస్తుండగా వారు వద్ద నుంచి 10 లీటర్లు నాటు సారా స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే ఆలమూరు మండలంలోని చెముడులంకలో అక్రమ మద్యం అమ్మకాలు చేస్తున్న నాగిరెడ్డి మల్లయ్య నుంచి 26 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్ళరేవు రెడ్డివారి పేట సమీపంలో జాతీయ రహదారి 216పై బైపాస్‌లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఒక ప్రైవేట్ ట్రావెల్ బస్సును పాల వ్యాను ఢీ కొట్టి అదుపుతప్పి ముందు వెళుతున్న బైకును ఢీకొంది. దీంతో బైకుపై వెళ్తున్న అమలాపురానికి చెందిన ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108లో కాకినాడ ప్రభుతాసుపత్రికి తరలించారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మర్లావ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. గండేపల్లి మండలం బొర్రంపాలెంలో నిర్వహించిన దాడుల్లో ఒక వ్యక్తి నుంచి అక్రమంగా నిలవజేసిన 8 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు ప్రసాదరావు, పి.చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి చోరీపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-తాళ్లరేవు

పి.మల్లవరంలో వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా గల స్థలంలో మట్టిని అక్రమంగా తవ్వి కొందరు వ్యక్తులు తరలించారని బాధితులు ధూళిపూడి నరసింహారావు, వెంకట సూర్యనారాయణ శుక్రవారం కోరంగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ తండ్రి వారసత్వంగా సంక్రమించిన ఐదున్నర సెంట్ల స్థలంలో సుమారు 6 అడుగుల మేర మట్టిని తవ్వేసి కొందరు దౌర్జన్యంగా తరలించారని బాధితులు ఆరోపించారు. ఆ స్థలానికి సంబంధించి సర్వే నిర్వహించాలని సర్వే పూర్తయ్యే వరకు ఎవరు ఆ భూముల్లోకి ఎవరు వెళ్ళకూడదని కోరింగ్ ఎస్.ఐ.పి.సత్యనారాయణ చెప్పినట్టు బాధితులు విలేకరులకు తెలిపారు.

హైవేలో డివైడర్‌ను ఢీకొన్న ఆటో

డివైడర్‌ను ఢీకొన్న ఆటో
ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని ఎర్రవరం సిపిఎఫ్ ఫ్యాక్టరీ వద్ద జాతీయ రహదారిపై ఆటో శుక్రవారం డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు జీడి పిక్కల ఫ్యాక్టరీ మహిళా కార్మికులు గాయాల పాలయ్యారు. మూసివేసిన దీపిక ఫ్యాక్టరీని తెరిపించాలని గత 14 రోజులుగా ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారి స్వగ్రామమైన పెద్దనాపల్లికి ఆటోలో వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడిన వారిలో పెద్దనాపల్లికి చెందిన కప్పల దేవి, కీర్తి రత్నకుమారి, కీర్తి నాగమణి, బుద్ధ రాణి, శరకణం భూలక్ష్మి, శరణం జగవేణి ఉన్నారు. వీరిని నేషనల్ హైవే అంబులెన్స్‌లో ప్రతిపాడు తరలించారు. ఎస్ఐ ఎన్.రామలింగేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిఎస్ఒ ఎంవి.ప్రసాద్‌పై చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ

కాకినా పోర్టులో మంత్రి పవన కల్యాణ్ తనిఖీల అనంతరం యంత్రాంగం కదిలింది. డిఎస్ఒ ఎంవి.ప్రసాద్‌ను పౌరసరఫరాలశాఖ కమిషనరేట్‌లో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. దీంతో కాకినాడ జిల్లా ఇన్‌ఛార్జి డిఎస్ఒగా లక్ష్మీదేవికి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

హైగ్లో బస్ ప్రారంభం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కలెక్టర్ ప్రశాంతికి బస్సు గురించి వివరిస్తున్న ప్రిన్సిపల్

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో హైగ్లో(ల్యాబ్ ఆన్ వీల్స్) బస్‌ను శుక్రవారం కలెక్టర్ పి.ప్రశాంతి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర మాట్లాడుతూ కళాశాల చరిత్రలో మొదటి సారిగా ఈ బస్‌ను ప్రారంభించామనఆనరు. హైదరాబాద్‌కు చెందిన హంసా సొల్యూషన్స్ చైర్మన్ కెవి.రాంప్రసాద్ ఈ బస్సును అందించారన్నారు. గ్రామీణ ప్రాంతంలో చదువుతున్న విద్యార్థులకు చిన్ననాటి నుంచి శాస్త్ర, సాంకేతిక అంశాలపై జిజ్ఞాస కల్పించేందుకు ఇది ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఆధునిక పరిశోధనావిషయాలను పరికరాల ద్వారా పిల్లలకు తెలిపేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఆధ్యాపకులు పరిశోధనాత్మక అనుభవ జ్ఞానాన్ని ప్రత్యక్షంగా క్షేత్ర స్థాయిలో పిల్లలకు నేర్పించి శాస్త్రపరంగా సమాజాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. అనంతరం హైగ్లో బస్ వాహనం డొనేట్ చేసిన కెవి.రాంప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో, కుగ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను గొప్ప శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలన్నారు. వారి ఆలోచనలను కళాశాలలోని ల్యాబ్ ఎక్విప్మెంట్ ద్వారా నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర విభాగం వారిచే 'స్టూడెంట్ ఇనిషియేటివ్ స్టార్టప్'ను ప్రారంభించారు. అనంతరం హంస సొల్యూషన్స్‌తో కళాశాల ఎంఒయు చేసుకుంది. ఈ కార్యక్రమంలో రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్, రాజమండ్రి, ఎడ్యుకేషన్ జోన్ 1, 2 డాక్టర్ ఎస్.శోభారాణి, డిఇఒ కె.వాసుదేవరావు, హైగ్లో కో-ఆర్డినేటర్ కోమల లక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు పెండింగ్ అలవెన్స్‌లు చెల్లించాలి

ప్రజాశక్తి-కాకినాడ

సంవత్సరం కాలంగా పెండింగ్‌లో ఉన్న అంగన్వాడీల దారి ఖర్చుల అలవెన్స్ వెంటనే చెల్లించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రావతి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారులు సమావేశాల పేరిట పదేపదే అంగన్వాడీలను కార్యాలయాలకు తిప్పుతున్నారన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న అంగన్వాడీలకు దారి ఖర్చుల అలవెన్స్ చెల్లించాల్సి ఉన్న బకాయిలు పెట్టి ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ప్రతి నెలా కాకినాడ జిల్లా పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలను ప్రాజెక్టు సమావేశానికి, సెక్టార్ సమావేశానికి రెండుసార్లు అధికారులు పిలుస్తున్నారని తెలిపారు. వీటికి సబంధించి గతంలో ట్రావెలింగ్ అలవెన్స్ ఇచ్చేవారన్నారు. గత ఒక సంవత్సరం నుండి పెండింగ్‌లో ఉన్నా చెల్లించడం లేదన్నారు. 42 రోజుల అంగన్వాడీ సమ్మె సందర్భంగా ఒక సమావేశానికి మాత్రమే ట్రావెలింగ్ అలవెన్స్ ఇస్తాని, గతంలో మాదిరి ఇవ్వలేమని జిఒ కూడా ఇచ్చారన్నారు. జిల్లాలోని 1986 అంగన్వాడీ కేంద్రాల వర్కర్లను నెలకు ఒక సమావేశానికి మాత్రమే పిలుస్తామని చెప్పి పదే పదే కార్యాలయాలకు పిలుస్తున్నారని వారు తెలిపారు.

తమ స్థలాలు కాపాడాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి-పిఠాపురం

మంత్రి పవన్ కల్యాణ్‌కు సమస్యను వివరిస్తున్న దళితులు

పట్టణంలోని స్థానిక అగ్రహారంలో తాము కొనుగోలు చేసుకున్న స్థలాలు మున్సిపాలిటీకి చెందినవి అని తమను అధికారులు వేధిస్తున్నారని తమను ఆదుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణకు పలువురు వినతిపత్రం అందజేశారు. ఆ స్థలంలో పలువురు దళితులు శుక్రవారం టెంట్ వేసి నిరసనకు దిగారు. ఆ సమయంలో అటుగా కాకినాడకు పర్యటనకు వెళుతున్న పవన్ కల్యాణ్ దృష్టికి సమస్యను తీసుకునివెళ్ళారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము మూడేళ్ల క్రితం భూమి కొనుగోలు చేశామని దానికి సంబంధించిన ఆధారాలు, డాక్యుమెంట్స్ తమ వద్ద ఉన్నాయని తెలిపారు. తాము కొనుగోలు చేసిన స్థలం మున్సిపాలిటీకి చెందినదని, అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని ఇల్లు కట్టుకునేందుకు ప్లానింగ్ అడుగుతుంటే లంచాలు అడుతున్నారని, దళితులపై పక్షపాత వైఖరితో వ్యవహారిస్తున్నారన్నాని వాపోయారు. దీనిపై స్పందించిన మంత్రి పవన్ కల్యాణ్ సమస్యపై వివరాలు పూర్తిగా తెలుసుని త్వరతగతిన పరిష్కరించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్‌కు సూచించారు.

బాలికల భద్రతపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

సమాజంలో బాలికల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని ఎంపిడిఒ శ్రీలలిత అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సిడిపిఒ జి.ఉష అధ్యక్షతన బాలికల భద్రతా నియమాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలు అర్థమయ్యే రీతిలో వివరించాలన్నారు. బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిని గుర్తించడం, వారిపై ఫిర్యాదు చేసే విధంగా అవగాహన పెంచాలన్నారు. ప్రతి బాలికా స్వేచ్ఛపూరిత వాతావరణంలో పెరిగే విధంగా ప్రతి ఒక్కరూ చేయూతనిస్తూ అండదండలు అందించాలన్నారు, ఈ సదస్సులో పడాల చారిటబుల్ ట్రస్ట్ తరపున ప్రసాద్ రెడ్డి మాట్లాడారు. తమ సంస్థ ఆధ్వర్యంలో బాలికల భద్రత పట్ల అవగాహన పెంచే సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సులో పెద్దాపురం ఎంఇఒ విఆర్‌కె.చౌదరి, సామర్లకోట ఎంఇఒ పి.పుల్లయ్య, ఎపిఎంలు శ్రీనుబాబు, సిహెచ్.జగదీశ్వరి ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఎన్.ఉమాదేవి, టి.వెంకట రమణమ్మ, జి.వరలక్ష్మి, కె.నిర్మల కుమారి తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్ వద్ద ప్రమాదాల నివారణకు చర్యలేవీ..

ప్రజాశక్తి-శంఖవరం

తరచూ ప్రమాదాలు జరుగుతున్న మెయిన్ రోడ్ జంక్షన్

అన్నవరం జూనియర్ కళాశాల ఎదురుగా పెట్రోల్ బంకు వద్ద మెయిన్ రోడ్డు జంక్షన్ వద్ద తరచుగా జరిగే యాక్సిడెంట్ల నివారణకు అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం దేవస్థానానికి నిత్యం వేల సంఖ్యలో యాత్రికులు వస్తుంటారు. కార్తీక మాసంలో శని, ఆది, సోమవారాల్లో ఈ సంఖ్య 70 నుండి 80 వేల వరకూ ఉంటుంది. ప్రతిరోజూ 5 నుండి 6 వేల వరకు వాహనాలు కొండ పైకి వెళ్తుంటాయి. తుని నుండి కాకినాడ వైపు వెళ్లే వాహనాలు ముందుకు వెళ్లి యు టర్న్ తీసుకుని కొండ పైకి వెళ్లవలసి ఉంటుంది. అలాంటప్పుడు తరచూ అక్కడ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రాజమండ్రి వైపు నుండి తుని వెళ్లే వాహనాలు ఎదురుగుండా రావడంతో తరచూ అక్కడ యాక్సిడెంట్లు జరిగి యాత్రికులు గాయపడుతున్నారు. ఈ కారణంగా ఆ ప్రదేశంలో స్పీడ్‌బ్రేకర్స్, స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రించే గార్డ్‌ను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని గ్రామస్తులు కోరుచున్నారు.

పామాయిల్ సాగుతో అధిక లాభాలు

ప్రజాశక్తి - గండేపల్లి

పామాయిల్ తోటలు పెంచడం వల్ల రైతులు ఆర్థికంగా బలోపేతం కావచ్చని పతంజలి ఫుడ్స్ డిజిఎం ఎఎస్.ప్రకాష్ అన్నారు. శుక్రవారం గండేపల్లి, మండలం బొర్రంపాలెంలో ఆయిల్‌పామ్ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్.ప్రకాష్ పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్‌పామ్ తోటలతో అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. ఆయిల్‌పామ్ పంట ప్రాముఖ్యత, ప్రత్యేకతల గురించి వివరించారు. కంపెనీ రైతులకు కల్పించే సదుపాయాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోకల సుబ్బారావు, ఎక్స్ సర్పంచ్ పల్లపు విష్ణు చక్రం, కంపెనీ సిబ్బంది, వీర్రాజు, జివివి.ఎస్.దుర్గా ప్రసాద్, గణేశ్వరరావు, ఎస్‌వి.మణికుమార్, ఆయిల్‌పామ్ రైతులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను ఆపాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

తూరంగి పంచాయతీ పరిధిలోని అల్లూరి సీతారామరాజు కాలనీలో ఉన్న సర్వే నెంబర్ 217/26లో ఉన్న సామాజిక స్థలంలో అక్రమ కట్టడాలను సిపిఎం రూరల్ కమిటీ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా పార్టీ రూరల్ కన్వీనర్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు మట్లాడారు. రెండు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న పార్క్, వాకింగ్ ట్రాక్ పనులు స్థలంలో జరుగు తుండగా మరో వైపు మిగిలిన సామాజిక స్థలంలో అక్రమ కట్టడాలపై తక్షణం చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి జోగా రమణమ్మను కోరారు. ఈ బృందంలో చింతపల్లి అజయ్ కుమార్, తొట్టిపూడి రాజా, తటవర్తి సుబ్బారావు, రచ్చా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

1న సాగర తీరంలో కుంభాభిషేకం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కాకినాడ సాగర తీరంలో కుంభేశ్వర స్వామి 49వ మహా కుంభాభిషేకం డిసెంబర్ 1న ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు భోగిరెడ్డి తాతయ్య నాయుడు, తోట పుండరీకాక్షులు (బాబి), చిట్నీడి శ్రీనివాస్, గంగాపాత్రుని వాసు, నామన సత్య ప్రసన్న తెలిపారు. ఈ మహా ఉత్సవంలో స్నాన ఘట్టం ఏర్పాటు చేయడమే కాకుండా యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఆదివారం అమావాస్య సందర్భంగా తెల్లవారుజాము నుంచే అమ్మవారు, స్వామి వార్లకు అభిషేకాలు ప్రారంభమవుతాయని చెప్పారు.

సైన్స్ ప్రయోగాలపై అవగాహన

పెద్దాపురం : స్థానిక రామారావుపేటలోని ఎసిటి సైన్స్ సెంటర్‌లో శుక్రవారం కట్టమూరు జిల్లా పరిషత్ హై స్కూల్ 10వ తరగతి విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సైన్స్ ప్రయోగాల అవగాహనలో విద్యార్థులకు ఆమ్లాలు, క్షారాలు, లవణాలు వంటి పాఠ్యాంశాల్లోని అంశాలపై విద్యార్థులతో అర్థమయ్యే రీతిలో ప్రయోగాలు చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు.

డ్రగ్స్ కట్టడికి చర్యలపై హర్షం

కాకినాడ రూరల్ : రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌పై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం హర్షణీయమని మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కొంతకాలంగా గంజాయి సాగు, అక్రమ రవాణా విచ్చలవిడిగా పెరిగిందన్నారు. అనేక మంది విద్యార్థులు వీటికి బానిసలై దోపిడీలకు, దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. వీటి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం డిజి స్థాయి అధికారి నేతృత్వంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయడం కూడా మంచి పరిణామం అన్నారు.

నేడు సామాజిక పింఛన్ల పంపిణీ

గండేపల్లి : డిసెంబరు 1వ తేదీన ఆదివారం సెలవు కావడంతో సామాజిక భద్రతా పింఛన్లను శనివారం పంపిణీ చేస్తామని ఎంపిడిఒ నాతి బుజ్జి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పింఛన్ పంపిణీ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు.

భీమేశ్వరాలయంలో హైకోర్ట్ జడ్జి పూజలు

సామర్లకోట : కుమారరామ భీమేశ్వరాలయంలో హైకోర్ట్ జస్టిస్ వి.సుజాత శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. జస్టిస్ సుజాతకు ఆలయ అధికారి బళ్ళ నీలకంఠం సిబ్బందితో సాధారంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె భీమేశ్వర స్వామికి, బాలా త్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆమెకు ఆలయ నంది మండపంలో పండితులు పూజలు జరిపించి ఆశీర్వదించారు

యానాం వార్తలు

అభివృద్ధి పనులు భూమి పూజ చేస్తున్న మల్లాడి కృష్ణారావు

రూ.25 కోట్లతో 58 అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో గత నాలుగు సంవత్సరాల క్రితం నిలిచిపోయిన అభివృద్ధి పనులను దశలవారీగా నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు చేపట్టామని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. యానాం నియోజకవర్గం పరిధిలోని వెంకట్ నగర్, దొమ్మేటిపేట, సావిత్రి నగర్ గ్రామాల్లో సుమారు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివద్ధి పనులకు శుక్రవారం ఉదయం ఆయన పరిపాలనాధికారి మునుస్వామి, అధికారులతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020లో రూ.19.50 కోట్ల అభివృద్ధి నిధులు, రూ.2.30 కోట్ల సిఎస్ఆర్ నిధులతో 58 పనులు చేసేందుకు సిద్ధం చేశామన్నారు. ఎన్నికల కోడ్, మరికొన్ని కారణాల వల్ల పనులు నిలిచిపోవడంతో ప్రస్తుతం వడ్డీతో కలిపి సుమారు రూ.25 కోట్లు అయ్యిందన్నారు. ఆ మొత్తంతో ఆయా పనులను దశలవారీగా భూమి పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దీంట్లో భాగంగా దొమ్మేటిపేట, వెంకట్ నగర్, సావిత్రినగర్‌లో పనులకు భూమి పూజ చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మల్లాడి కృష్ణారావుతో పాటు అధికారులను స్థానిక నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిడబ్ల్యుడి ఎఇ కాళ్ల నాగరాజు, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, మల్లాడి కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్స్ అందుకున్న విద్యార్థులు, పాల్గొన్న హస్తకళాకారులు

హస్త కళల ప్రదర్శనపై అవగహన

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాలపేట ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగిన హస్త కళలు ,ప్రదర్శన కార్యక్రమం శుక్రవారం ఘనంగా ముగిసింది. హస్త కళా సేవా కేంద్రం పుదుచ్చేరి, కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ వారిచే, మూడు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమానికి అతిథులుగా అసిస్టెంట్ డైరెక్టర్ వినోద్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు నళిని, జ్యోతి పాల్గొని మాట్లాడారు. నేటి తరానికి హస్త కళల మీద అవగాహన కలగటానికి ఇటువంటి కార్త్యమాలు దేశమంతా ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. హస్త కళాకారులు తయారీ విధానాన్ని వివరించి విద్యార్థులకు నేర్పించినట్టు తెలిపారు. అనంతరం విద్యార్థులందరికీ సర్టిఫికెట్స్ అందించారు.

హరిహర క్షేత్రంలో భారీ అన్నదానం

ప్రజాశక్తి- కడియం

మండలంలోని కడియపులంక హరిహర క్షేత్రంలో శుక్రవారం భారీ అన్న సమారాధన జరిగింది. కార్తీకమాసం మాస శివరాత్రి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ అన్నదానం నిర్వహించారు. సుమారు 50 వేల మంది ఈ అన్న సమారాధనలో పాల్గొన్నట్టు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి హాజరై మాట్లాడారు. నిస్వార్థ సేవలతో ఆలయ అభివద్ధికి పాటుపడుతూ ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్న చైర్మన్ మార్గాని సత్యనారాయణను అభినందించారు. కడియం సిఐ ఎ.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, సర్పంచ్ పాఠంశెట్టి రాంజీ, మాజీ సర్పంచ్‌లు పుల్లా రామారావు, గట్టి నర్సయ్య, నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు, కార్యదర్శి గాద నాగేశ్వరావు, నర్సరీ రైతులు బోడపాటి గోపి, పల్లా సత్యనారాయణమూర్తి, పల్ల సుబ్రహ్మణ్యం, పుల్లావీర వెంకటరావు, తాడాల విష్ణు చక్రవర్తి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు

ప్రజాశక్తి - సామర్లకోట

ఎరువుల గోదామును పరిశీలిస్తున్న ఎడిఎ రత్నప్రశాంతి

రైతులకు ఎంఆర్‌పి ధరలకు మించి ఎరువులు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కాకినాడ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రత్న ప్రశాంతి హెచ్చరించారు. మండలంలోని ఓం శాంతి ఎరువుల దుకాణంలో, లక్ష్మీనారాయణ ఎంటర్‌ప్రైజెస్‌లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. సామర్లకోట సుగర్ ఫ్యాక్టరీ గోదాంలో నిర్వహిస్తున్న ఫర్ టెక్స్ ఎరువులు, పురుగుల మందుల షాపులను తనిఖీ చేసి పరిశీలించారు. ఫారం ఒఎస్ ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు బిల్ బుక్స్ రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అని పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి ఇమ్మడిశెట్టి సత్య, టెక్నికల్ ఆఫీసర్స్ ఎ.గాయత్రి, విజయలక్ష్మి, పద్మజారాణి పాల్గొన్నారు.

ఆర్చరీ పోటీలకు 30 మంది ఎంపిక

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టంలోని స్థానిక ఆర్ఆర్‌బిహెచ్ఆర్ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం జిల్లా స్థాయి అర్చరీ పోటీలు జరిగాయి. ఈ పోటీలను జనసేన నాయకులు జోగా రమణ మార్నీడి రంగబాబు ప్రారంభించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుండి 85 మంది పాల్గొనగా 30 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీల్లో ఎంపికైన వారు డిసెంబర్ 3 నుండి 5వ తేదీ వరకు విజయవాడలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సీనియర్ ఆర్చరీ పోటీల్లో పాల్గొంటారని అర్చరీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జెఎన్ఎస్.గోపాలకష్ణ, పి.లక్ష్మణరావు తెలిపారు. మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్ వర్మ పోటీలకు ఎంపికైన వారికి బహుమతు ప్రదానం చేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా జి.శివప్రసాద్, కె.చిన్నబ్బాయి, బి.కృష్ణార్జున వ్యవహరించారు.

సిఎం సహాయ నిధి చెక్కుల అందజేత

ప్రజాశక్తి- నల్లజర్ల

నల్లజర్ల మండలంలోని పలువురు బాధితులకు మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కులను గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకట్రాజు శుక్రవారం అందించారు. సుమారు రూ.9,89,200 విలువ చేసే చెక్కులను అందించారు. దూబచర్ల గ్రామంలోని కొవ్వూరి జ్యోతి, జగన్నాథపురం గ్రామంలోని మారుబోయిన కొండలరావు, తూర్పు చోడవరం గ్రామంలోని నిమ్మకాయల సత్యసాయి తాన్య, నల్లజర్ల గ్రామంలోని గన్నిన కృష్ణమూర్తి, కొమ్మిశెట్టి వీరవెంకటబాలయోగి, తెలికచర్ల గ్రామంలోని కామన సత్యనారాయణ, పోతవరం గ్రామంలో జాలాది ప్రసాద్, అనంతపల్లికి చెందిన బుసనబోయిన మంగమ్మలకు ఈ చెక్కులను ఆయా గ్రామాలకు వెళ్లి అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

10 నిమిషాల్లో ముగిసిన కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణంలో రోడ్లు వీధి దీపాలు డ్రైన్లు వంటి అనేక సమస్యలపై ఈసారైనా తమ సమస్యలు చర్చకు వచ్చి పరిష్కారం అవుతాయని ఎదురుచూసిన ప్రజలకు నిరాశ మిగిలింది. గొల్లప్రోలు నగర పంచాయతీ సమావేశం బుధవారం చైర్‌పర్సన్ గంద్రెటి మంగతాయారు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో డిసెంబర్ నెల జమ, ఖర్చుల వివరాలు చదివి వినిపించారు కౌన్సిలర్ మైనం భవాని రాజా మాట్లాడుతూ రోడ్లు డ్రైన్లు పూర్తి చేయకుండా నిలిపివేశారని, వాటిని పూర్తి చేయమని కోరగా ఎన్నికల కోడ్ వల్ల ఆలస్యం అవుతోందని ఎఇ ప్రభాకర్ తెలిపారు. మిగిలిన కౌన్సిలర్లు సమస్యలపై గళమెత్తలేదు. దీంతో 20 మంది కౌన్సిలర్లకు గాను వచ్చిన పదిమంది కౌన్సిలర్లతో సమావేశాన్ని ప్రారంభించి 10 నిమిషాల్లో ముగించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పి.రవికుమార్, వైస్ చైర్మన్‌లు గంధం నాగేశ్వరావు, తెడ్లపు అలేఖ్యరాణి, కౌన్సిలర్లు గంద్రేటి శ్రీరామచంద్రమూర్తి, బెందుకుర్తి సత్తిబాబు, సింగం నాగేశ్వరావు పాల్గొన్నారు.

In Court of the Civil Judge Senior Division, Amalapuram

I.A No. 669/2024 / O.S.NO 64/2019

Between:

Dasireddy Veera Raghavulu S/o Mutyalu Aged 81 years, Agriculture Hindu, R/o D.No.2-26-1, Pappulavari Palem P. Gannavaram Mandalam, Dr.B.R.A.Konaseema District pin:533229

...Petitioner/ Plaintiff

AND

Beera Anasuya (late) W/o Pallayya (వగైరాలు)

D-3: Beera Satyanarayana Murthy, S/o Pallayya, Aged about 56 years, D.No.3-53, Dan Center, Papppurlavari palem P. Gannavaram Mandala, Dr.B.R.A.K District 533229

D-4: Beera Srinivasa Rao, S/o Pallayya, Aged about 50 years, -DO-

D-5: Salladi Raja Lakshmi, D/O Pallayya, Aged about 54 years, -DO-

D-6: Petta Bharati, D/O Pallayya, Aged about 52 years, -DO- ***...Defendants***

పై నెంబరు దావాలో మూడవ ప్రతివాది నుండి 6వ ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు నోటీసులు పంపించినను మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు నిమిత్తం **దీ. 17-12-2024 సం॥ తేదిన వాయిదా వేసినారు మీరు ఆ రోజున ఉదయం గం॥ 10-30 ని॥లకు** స్వయంగా గాని మీ వకీలు ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడుననీ రూఢీగా తెలియపరచడమైనది.

సయ్యద్ హమీద్ పాషా
అడ్వకేట్, అమలాపురం
సెల్: 9490786161

అమలాపురం
28-11-2024